# డేటా ఎంట్రీ

చిక్కాల శంకరనారాయణ

''అదేం చిత్రమో! కొత్తగా పెళ్లైన జంటలకు మొదటి అంతస్తులో వుండే వాటాలే అద్దెకు దొరుకుతాయి'' అనుకుంది జుహి మెట్లెక్కుతూ. లక్కీగా ఆ అపార్ట్‌మెంట్స్‌లో మొదటి ఫ్లోర్‌లో డబుల్ బెడ్ రూమ్ ఫ్లాట్ దొరికింది. ఆ ఏరియాలో నీళ్ల ప్రాబ్లమ్ లేదు. ఏవి కావాలన్నా అక్కడక్కడే దొరుకుతాయి.

ఆమధ్య ఎవరో అంటున్నారు – ''ఈరోజుల్లో కొత్త పెళ్లికొడుకుల్ని ఏం ఉద్యోగం అని అడగక్కర్లేదుట. నూటికి తొంభై మంది సాఫ్ట్‌వేర్ బాపతులే'' అని అన్నట్టు విశ్వం కూడా ఆ బాపతే.

జుహి ఎంసిఏ చేసింది కాని ఎక్కడా సరైన ప్లేస్‌మెంట్ దొరకలేదు. ప్లేస్‌మెంట్‌దేముంది యివ్వాళ కాకపోతే రేపు దొరుకుతుంది గాని విశ్వంలాంటి కుర్రాడు దొరకడం మాత్రం అదృష్టమే. నైస్ గై! అని రోజూ రెండు మూడుసార్లయినా ముచ్చటపడుతూ వుంటుంది జుహి. ఫ్లాట్ తాళం తీసిందో లేదో మోటర్‌బైక్ చప్పుడు బేస్‌మెంట్‌లో ప్రతిధ్వనించింది. బైక్ రెయిజ్ చేసినపుడు, టైముని బట్టి తేలిగ్గా వాళ్లదేనని గుర్తుపట్టగలదు జుహి. ఆ చప్పుడు చెవులపడగానే చక్కిలిగిలి పెట్టినట్టు అవుతుంది.

విశ్వం గొప్ప అందగాడని చెప్పలేదు గాని జుహికి చాలా యిష్టం. ఎందుకంటే దానికి బోలెడు కారణాలు. ఏమీ ఎరగనట్టు వుంటాడు గాని, అమ్మో అసాధ్యుడు. సరదాగా సాయంత్రంపూట నెక్లెస్ రోడ్‌లో మొబైక్ మీద చక్కర్లు కొడుతుంటే, గాలిలో యీత కొడుతున్నట్టు వుంటుంది. తను కోతిపిల్లలా విశ్వం వీపుకి అతుక్కుపోయి, గారిగా చేతులు పెనవేస్తుంది. ఒకసారి ''పోనీ నువ్వు డ్రైవ్ చేస్తావా బుద్ధిగా నీ వెనక నే కూచుంటా'' నన్నాడు. ''ఓ యాహూ'' అని సీటు మారింది. తర్వాత తెలిసింది విశ్వం కుర్రబుద్ధి. కాని, అయినా మొబైక్ రైడ్ విత్ విశ్వం అంటే ఝామ్మని చందమామ కథలో గుర్రం మీద రాకుమారుడు రాకుమార్తె జ్ఞాపకం వస్తారు. ఈ విశ్వంతో యిదే చావు. ఏమిటేమిటో గుర్తొచ్చేసి, వొళ్ళు బ్రెయినూ ఏమిటేమిటో అయిపోతుంది జుహికి.

విశ్వం పొద్దున ఎనిమిదింటికి వెళితే సాయంత్రం అతను వచ్చాడంటే అయిదు అయినట్టు లెక్క. జుహి వొక చిన్న కంపెనీకి చిన్న చిన్న ప్రాజెక్టులు చేసి పెడుతూ వుంటుంది. కుటీర పరిశ్రమ లాంటిది. ఆ కంపెనీ వాళ్ళు ఎక్కడో పెద్ద ప్రాజెక్టు పట్టుకుంటారు. దానిని



చిన్న చిన్న చిప్స్ కింద కొట్టి జుహిలకు తలో చిప్పు పంచిపెడుతుంటారు. చోటు ఇవ్వరు, బల్ల కుర్చీ యివ్వరు, సిస్టమ్ ఇవ్వరు. లైటు ఫ్యాను ఖర్చు లేదు. పేపర్స్ తీసుకెళ్ళు, ఇంటిదగ్గరే చేసిపడెయ్. మా సిస్టమ్‌లోకి వచ్చేస్తుందన్నారు ఆ ప్రాజెక్టు వాళ్లు. అందుకని జుహి ఖాళీ దొరికినప్పుడల్లా సిస్టమ్ మీద డేటా ఎంట్రీలు కొట్టేస్తూ వుంటుంది. పరమ బోరు అనిపిస్తుంది. అయినా మరి తప్పదు. చేసినకొద్దీ డబ్బు వస్తుంది. అది దొరికినా చాలనుకునే వారు బోలెడు మంది. కాని ఒక్కొక్కసారి డెడ్‌లైన్స్ పెడతారు. అప్పుడు మాత్రం మళ్లీ జన్మంటూ వుంటే యీ వాయిద్యం నేర్చుకోకూడదనిపిస్తుంది జుహికి.

> ''నాకు ఆ వేషాలే గిట్టవ్. ఇప్పటి దాకా నిద్రపోయే వాడివి వొక్కసారి అట్లా స్పృహ ఎట్లా వస్తుందో, వచ్చినా చేతులూ కాళ్లూ అట్లా ఎందుకు కదుల్తాయో... జస్ట్.. జస్ట్ ఐకాంట్ యిమేజిన్''

సాయంత్రం విశ్వం రాగానే కాసేపు కబుర్లు, కాసేపు టీవి ఆపైన భోజనం. తొమ్మిదింటికి తానొక ఫోను, అతనొక ఫోను ముగించేసరికి పది. రాత్రి పది గంటలంటే కొత్త జంటకి వొళ్లంతా అగరు గంధపు పొగలూ సెగలూ వస్తుంటాయి. జుహి చాలా కూల్‌గా కంప్యూటర్ ఆన్ చేస్తుంది. విశ్వం చిన్న డ్రాయర్ వేసుకుని టార్జాన్ గెటప్‌లో మంచం మీద వాలతాడు. అప్పుడే జుహికి వొళ్లు మండేది. పోనీ ఎంతైనా మొగాడు కదా. ''ఆ సన్యాసి పని రేపు చేసుకోవచ్చులే, వచ్చి పడుకో''మని మర్యాదగానో మందలింపుగానో అనచ్చుకదా. ఉహు అనడు. పోనీలే అని వూరుకున్నానా... మైగాడ్! గురక వినిపిస్తుంది. ''జుహి పరిపరివిధాల ప్రబంధ నాయికలా వాపోయింది. ''విశ్వం నీ పని యిట్లా వుందా'' అని అన్ని స్విచ్‌లూ టపటపా ఆపేసి టార్జాన్‌కి చెయ్యివాటు దూరంలో తనూ వొళ్లు వాల్చింది. విశ్వం నిద్రలో వేసినట్టు, అప్రయత్నంగా ఆమె మీద చెయ్యి వేశాడు. జుహి వొక్కసారి తోక తొక్కిన తాచులా లేచింది. ''నాకు ఆ వేషాలే గిట్టవ్. ఇప్పటిదాకా నిద్రపోయే వాడివి వొక్కసారి అట్లా స్పృహ ఎట్లా వస్తుందో, వచ్చినా చేతులూ కాళ్లూ అట్లా ఎందుకు కదుల్తాయో... జస్ట్.. జస్ట్ ఐకాంట్ యిమేజిన్'' అంటూ జుహి టపటప లైట్లు వేసింది. విశ్వం ఏమీ పట్టనట్టున్నాడు. అనుకోని వెలుగుకి కళ్లు చికిలించాడు. ఆమె ఏమి చేస్తోందో గమనించాడు. జుహి అలారం పీస్ తీసి సరిగ్గా నాలుగు మీద టైం సెట్‌చేసి, దాన్ని యథాస్థానంలో వుంచింది. లైట్లు ఆర్పిన చప్పుడు. అంతా చీకటి. సుఖంకోసం రెండు ప్రాణుల తాలూకు భాగాలు చీకట్లో తడుముకుంటున్నాయి. చిరుచలిలోంచి మనసుకు నచ్చినంత వెచ్చదనం వాళ్లిద్దరినీ ఆవరించి చుట్టేసింది. ఆ గదిలో అలారం టైంపీస్ సెకన్ల ముల్లు చప్పుడు తప్ప యింకేమీ లేదు.

తెల్లవారు జాముకి చలి ముదిరింది. విశ్వం జుహి వొకరిలో వొకరు వొదిగిపోయి చలిని జయించారు. ''బలేగా వుంది'' అని జుహి మనసులో అనుకుంది. వెంటనే అలారంపీస్ సంగీతం వినిపించింది. ''అబ్బా'' అనుకుంది జుహి. అది యింక మొదలుపెడితే ఆపదు. కాసేపు ఆగితే ట్యూను మారుస్తుంది. ఇంకాసేపు బద్ధకిస్తే శ్రుతి పెంచుతుంది. పైగా డయల్ వొక్కసారి వెలుగుతుంది. జుహికి మరుక్షణం చెయ్యాల్సిన పని గుర్తుకు వచ్చింది. దాని మేలుకొలుపుల్ని ఆపింది. ఒక్కసారి విశ్వంలో పెనవేసుకుపోయిన కాళ్లు చేతుల్ని కూడదీసుకుని వొళ్లు విరుచుకుంది జుహి. జుహితోపాటు గది వెలిగింది. ఐదంటే ఐదు నిముషాల్లో, ముఖం మీద వేడి నీళ్లు చిలకరించుకుని ఫ్రెష్‌గా అయింది. చేతి వేళ్లతోనే క్రాప్‌ను పైకి దువ్వింది. సిస్టం ముందు కూచుని ఆన్ చేసింది. వేళ్లు వేళ్లు కలిపి వెనక్కి విరిస్తే మెటికలు టపటపమన్నాయి. డేటా ఎంట్రీ ఫైల్స్ తీసింది. పక్కకి చూసింది. విశ్వం హాయిగా నిద్రపోతున్నాడు. దుప్పటి ముసుగులో ఒక చెంప, నుదుటిమీద వాలిన జుత్తు వుంగరాలు మాత్రమే కనిపిస్తున్నాయి. ఒక వైపు చలి, మరోవైపు నిద్రమత్తు, యింకోవైపు విశ్వం – వీటన్నిటి మధ్యా యీ చాకిరీ. ''హే భగవాన్ ఏమిటి నాకీ శిక్ష'' అనుకుంది జుహి. ''ఇప్పుడు నాలుగుంబావు అయింది. ఎప్పటికి తెల్లవారనురా దేవుడా...'' అని నిట్టూర్చింది. పనిలో దిగబోయేముందు విశ్వం వంక మరోసారి చూసింది. విశ్వం నిద్రమొహంలో కొత్తగా వున్నాడు. ''పోనీ...'' అంటూ ఏదో అనుకోబోయి మళ్లీ ఆగింది. ''పట్టుదల లేకపోతే ముందుకు వెళ్లలేం'' అని సడలబోతున్న పట్టుని మళ్లీ పట్టింది.

ఇంతలో నాయనమ్మ మాట చెవుల్లో రింగుమంది. ''కర్పూరం కుర్రతనం వొక్కలాంటివేనే పిల్లా. వాడినా వాడకపోయినా హరించిపోతాయి...'' అదే మాట మళ్లీ మళ్లీ వినిపించి రెచ్చకొడుతున్నట్టు అనిపించింది జుహికి. మరుక్షణం వొక్కసారిగా లైట్లు ఆరిపోయాయి. సిస్టం కళ్లు మూసుకుంది. జుహి విశ్వం పక్కన వుంది. విశ్వం గాఢనిద్రలో లేడని గ్రహించడానికి జుహికి అట్టేసేపు పట్టలేదు. ''అసంకల్పిత ప్రతీకారచర్య'' అంటే యిదేనేమో అనుకుంది. కొత్తజంటకి ఆ పొద్దు గడిచి. భళ్లున తెల్లారింది. రొటీన్ ప్రారంభం అయింది తాజాగా.

పొద్దుకూకింది. మళ్లీ అదే వరస. జుహి రాత్రి పడుకోబోతూ అలారం పీస్‌ని ఆన్ చేస్తోంది. అప్పటికే బడలికగా నిద్రమత్తులో వున్న విశ్వం ఆవలిస్తూ ''జుహి... వారం రోజులనుంచి యిదేవరస. తెల్లారుజామున అలారంతో లేపి.... ఎందుకొచ్చిన తంటా చెప్పు'' అన్నాడు.

''తప్పదండీ, ఇప్పటికే వాళ్లిచ్చిన షెడ్యూలు దాటిపోయింది. రాత్రీపగలూ చేస్తేగాని డేటా ఎంట్రీ తెమల్దు'' అన్నది కరాకండిగా జుహి.

''ఇదిగో చూడు... నీ అలారం జాగారం కాదుగాని ఆఫీసులో నాకు నిద్ర వస్తోంది. అక్కడ నా పనులు పాడౌతున్నాయి. పోనీ యివ్వాళ్లినుంచి వో పని చెయ్..''

విశ్వం సలహా ఏమిటన్నట్టు కళ్లింత చేసి ఆశగా చూసింది జుహి.

''ఏం లేదు. ఆ తెల్లారగట్ల డేటాఎంట్రీ కూడా ఏకంగా యిప్పుడే పూర్తి చేసేస్తే సరి'' అన్నాడు వుత్సాహంగా. దటీజ్ విశ్వం?

